సాక్షి ఖమ్మం

శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023



స్వగ్రామాల్లో సంబురం

మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన భట్టి విక్రమార్క, శ్రీనివాసరెడ్డి, తుమ్మల స్వగ్రామాల్లో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. 8లో



సమగ్రచట్టం కోసం పోరాడుతా..

వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి కేంద్రం సమగ్రచట్టం తీసుకొచ్చేలా పోరాడుతానని ఎంపీ నామా నాగేశ్వరరావు తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 20°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం చలిగాలులు వీచే అవకాశముంది. రోజంతా కనిష్టస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

వైరా రిజర్వాయర్‌లో పెరిగిన నీటిమట్టం



వైరా రిజర్వాయర్

వైరా: తుపాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో వైరా రిజర్వాయర్‌లోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. ఈ మూడు రోజుల్లో రిజర్వాయర్ నీటిమట్టం 14.5 అడుగులకు చేరింది. కామేపల్లి, ఏన్కూరు, కొణిజర్ల, తల్లాడ మండలాల్లో కురిసిన వర్షపు నీరు వాగుల ద్వారా రిజర్వాయర్‌లోకి వచ్చి చేరింది. పది రోజుల క్రితం 12 అడుగుల కిందకు నీటిమట్టం పడిపోగా రైతులు ఆందోళన చేశారు. ఇంతలోనే భారీ వర్షానికి నీటిమట్టం పెరగడంతో తాగునీటికి ఇబ్బంది ఉండదని అధికారులు భావిస్తున్నారు.

ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా నూతన కార్యవర్గం



సెల్యూకాస్, అధ్యక్షుడు



ఆదర్శ్‌కుమార్, కార్యదర్శి

ఖమ్మం స్పోర్ట్స్: ఫుట్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ సమావేశం గురువారం ఖమ్మంలో జరగగా జిల్లా అధ్యక్షుడిగా కే.ఈ.సెల్యూకాస్, కార్యదర్శిగా కల్యాణపు ఆదర్శ్‌కుమార్ ఎన్నికయ్యారు. అలాగే, ఉపాధ్యక్షులుగా గంగాప్రసాద్, వెంకట్‌రెడ్డి, రాజారావు, ముజాహిద్, శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా రాంబాబు, రమణ, అబ్బాస్, జి.ప్రేమ్‌కుమార్, కోశాధికారిగా జునాయిద్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం తరఫున సి.విజయరావు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.క్రిస్టోఫర్ బాబు పరిశీలకులుగా హాజరయ్యారు.

10న అండర్–19 క్రికెట్, హాకీ ఎంపిక పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: జిల్లా జూనియర్ కళాశాలల క్రీడల సంఘం ఆధ్వర్యాన ఈనెల 10వ తేదీన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–19 బాలుర క్రికెట్, హాకీ బాలబాలికల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి ఎం.డీ. మూసాకలీం తెలిపారు. ఇందులో క్రికెట్ పోటీలు ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో, హాకీ పోటీలు కొత్తగూడెంలోని రామచంద్ర ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు వయసు ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని ఆయన సూచించారు.

15నుంచి ఖమ్మంలో 'సెయింట్ ఆన్స్' క్రీడాపోటీలు

ఖమ్మం స్పోర్ట్స్: ప్రతిష్టాత్మకమైన సెయింట్ ఆన్స్ క్రీడోత్సవాలకు ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ వేదికగా నిలవనుంది. ఇక్కడ 15, 16, 17వ తేదీల్లో పోటీలు జరగనుండగా, దక్షిణ భారతదేశంలోని 24 జోన్లకు చెందిన సెయింట్ ఆన్స్ పాఠశాలల క్రీడాకారులు హాజరవుతారు. ఈమేరకు పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సెయింట్ జోసెఫ్ హైస్కూల్ పీరియర్ సిస్టర్ మరియసుందరి, హెచ్‌ఎం నక్షత్రం తెలిపారు. సెయింట్ ఆన్స్ క్రీడోత్సావాల్లో భాగంగా అథ్లెటిక్స్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, త్రోబాల్, ఖో–ఖో, కబడ్డీ పోటీలు ఉంటాయని చెప్పారు. దక్షిణ భారతదేశ స్థాయిలో జరిగే పోటీలకు 1,800మంది క్రీడాకారులతో పాటు మరో 200 మంది కోచ్‌లు, మేనేజర్లు హాజరవుతారని తెలిపారు. హైస్కూల్ స్థాయి, ప్రాథమిక స్థాయిలో వేర్వేరుగా ఈ పోటీలు జరుగుతాయని, విద్యాశాఖ అనుమతితో సీనియర్ పీఈటీల సేవలను పోటీల నిర్వహణలో వినియోగించుకుంటామని వెల్లడించారు.

ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయానికి అవార్డు



గవర్నర్ నుంచి అవార్డు అందుకుంటున్న శ్రీరామ్

ఖమ్మంమయూరిసెంటర్: 2022 సంవత్సరానికి గాను సాయుధ దళాల ఫ్లాగ్ డే సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో అత్యధికంగా నిధులు సేకరించినందుకు ఖమ్మం ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయానికి అవార్డు లభించింది. ఈ అవార్డును గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జిల్లా ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి కొండపల్లి శ్రీరామ్‌కు గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సైనిక సంక్షేమ శాఖ సంచాలకులు రిటైర్డ్ కల్నల్ రమేష్‌కుమార్, కార్యాలయ సిబ్బంది కె.శ్రీనివాసరావు, వాసు పాల్గొన్నారు.

మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తున్న భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వేదికపై గవర్నర్ తమిళిసై, సీఎం రేవంత్‌రెడ్డి, తదితరులు







ముచ్చటగా ముగ్గురు!

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరగా... ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురికి మంత్రివర్గంలో చోటు లభించింది. ఉమ్మడి జిల్లా రాజకీయ చరిత్రలో ముగ్గురికి అవకాశం దక్కడం ఇదే తొలిసారి కావడం విశేషం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తర్వాత డిప్యూటీ సీఎంగా మల్లు భట్టి విక్రమార్క ప్రమాణ స్వీకారం చేశారు. అలాగే, ఆరో వరుసలో పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పదో వరుసలో తుమ్మల నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం జరిగింది. ఇందులో భట్టి, తుమ్మల దైవసాక్షిగా, పొంగులేటి పవిత్ర హృదయంతో ప్రమాణ స్వీకారం చేశారు.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

జిల్లా నుంచి మంత్రివర్గంలో త్రిమూర్తులు

- ఉప ముఖ్యమంత్రిగా మల్లు భట్టివిక్రమార్క
- మంత్రులుగా పొంగులేటి, తుమ్మల ప్రమాణస్వీకారం
- ఉమ్మడి జిల్లాలో ముగ్గురికి పదవులు ఇదే తొలిసారి
- కాంగ్రెస్ విజయంలో కీలకపాత్ర పోషించిన నేతలకు పట్టం

భట్టికి ఉన్నత పదవి

అంతా అనుకున్నట్లే భట్టికి కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్నత పదవి లభించింది. సీఎం పదవి కోసం భట్టి పోటీ పడినా.. చివరకు అధిష్టానం ఆయనను డిప్యూటీ సీఎం పదవితో సంతృప్తపరిచింది. జలగం వెంగళరావు తర్వాత ఉమ్మడి జిల్లాకు దక్కిన అత్యున్నత పదవి ఇదే. రేవంత్‌రెడ్డి తర్వాత అటు పార్టీ, ఇటు ప్రభుత్వంలో ప్రస్తుతం భట్టి కీలక నేతగా వ్యవహరించనున్నారు. గత ప్రభుత్వాల్లో పనిచేసిన అనుభవం ఉండటంతో భట్టి నేతృత్వాన ప్రజా సమస్యలు త్వరగా పరిష్కారం కానున్నాయని అనుచర నేతలు పేర్కొంటున్నారు. వైఎస్ ప్రభుత్వంలో ఓ వెలుగు వెలిగిన భట్టి 2009 నుంచి వరుసగా విజయం సాధిస్తూ వచ్చారు.

ప్రజలకు శీనన్నగా..

మాజీ ఎంపీ, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాజకీయాల్లో తన ప్రత్యేకతను చాటుకున్నారు. అతి తక్కువ కాలంలోనే మాస్ లీడర్‌గా ఎదిగి.. రాజకీయాలను శాసించే స్థాయి పొందారు. తొలుత కాంట్రాక్టర్‌గా పనిచేసిన పొంగులేటి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డిపై ఉన్న అభిమానంతో 2013 ఫిబ్రవరి 23న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 2014లో తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పొంగులేటి అదే ఏడాది జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తరఫున ఖమ్మం ఎంపీగా గెలిచారు. ఆయనతోపాటు పార్టీ నుంచి మరో ముగ్గురు ఎమ్మెల్యేలు, పొత్తులో భాగంగా భద్రాచలంలో సీపీఎం అభ్యర్థి సున్నం రాజయ్య గెలుపునకు కృషి చేశారు. పాలేరు ఉప ఎన్నికల సమయాన 2016 మే 3న బీఆర్‌ఎస్‌లో చేరిన పొంగులేటి ఆ తర్వాత జరిగిన పలు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం క్రియాశీలకంగా పనిచేశారు.

తిరుగుబాటు చేసి..

ఏడేళ్లపాటు బీఆర్‌ఎస్‌లో కొనసాగిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి.. కేంద్ర రవాణా, పర్యాటక, సాంస్కృతిక శాఖ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా, ఎనర్జీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసిన సంప్రదింపుల కమిటీలో సభ్యుడిగా పనిచేశారు. ఆ తర్వాత పార్టీలో తనకు సముచిత స్థానం దక్కలేదనే కారణంతో ఈ ఏడాది జనవరి 1న పార్టీపై తిరుగుబాటు చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తుండడంతో ఆయనను ఏప్రిల్ 10న బీఆర్‌ఎస్ సస్పెండ్ చేసింది. అనంతరం జూలైలో ఖమ్మంలో జరిగిన జనగర్జన బహిరంగ సభలో ఏఐసీసీ అగ్ర నేత రాహుల్‌గాంధీ సమక్షాన కాంగ్రెస్‌లో చేరిన పొంగులేటిని కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ కో చైర్మన్‌గా నియమించింది. ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 'తిరగబడదాం.. తరిమికొడదాం' పేరిట ప్రచారం నిర్వహించడమేకాక ఉమ్మడి జిల్లాలో గడపగడపకు కాంగ్రెస్‌ను తీసుకెళ్లారు. తొలిసారి ఎమ్మెల్యేగా తాజా ఎన్నికల్లో పాలేరు నుంచి గెలిచిన ఆయన మంత్రి పదవి దక్కించుకున్నారు.

సముచిత గౌరవం

ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయంలో అంతా తామై వ్యవహరించిన ముగ్గురు నేతలకు సముచిత గౌరవం దక్కింది. తెలంగాణ ఏర్పడ్డాక జరిగిన మొదటి రెండు ఎన్నికల్లో రాష్ట్రమంతటా బీఆర్‌ఎస్ సత్తా చాటినా ఇక్కడ మాత్రం కాంగ్రెస్‌కు అధిక స్థానాలు దక్కాయి. ఈసారి కూడా మెజార్టీ స్థానాలు దక్కడంలో భట్టి, పొంగులేటి, తుమ్మల కృషి ఉంది. వీరు తమ నియోజకవర్గాలే కాకుండా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రచారం చేస్తూ నాయకులను సమన్వయపరిచారు. దీంతో కార్యకర్తలు, నేతలు ఒకతాటిపైకి చేరగా కాంగ్రెస్ గెలుపు నల్లేరుపై నడకలా సాగింది. దీంతో ఈ ముగ్గురికి మంత్రివర్గంలో స్థానం దక్కగా.. హైదరాబాద్‌లో జరిగిన ప్రమాణ స్వీకారానికి ఉమ్మడి జిల్లా నుంచి అనుచర నేతలు భారీగా తరలివెళ్లారు.

మూడు ప్రభుత్వాల్లో మంత్రి

జిల్లా రాజకీయ చరిత్రలో 40 ఏళ్ల ప్రస్థానం కలిగిన నేత తుమ్మల నాగేశ్వరరావు. తెలుగుదేశం, బీఆర్‌ఎస్ హయాంలో మంత్రిగా పనిచేసిన ఆయనకు ప్రస్తుత కాంగ్రెస్ మంత్రివర్గంలోనూ స్థానం దక్కడం అరుదైన విషయంగా చెప్పుకోవాలి. 1985, 1995, 1996, 1999, 2001 ఏడాదిలో టీడీపీ హయాంలో చిన్ననీటి పారుదల శాఖ, ప్రొహిబిషన్, భారీ, మధ్యతరహా నీటి పారుదలశాఖ, ఎక్సైజ్, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా విధులు నిర్వర్తించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో 2014లో ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రిగా పనిచేశారు. ఆయన మంత్రిగా పనిచేసిన సమయాన ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి విశేష కృషి చేశారు. 2018లో పాలేరు నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి చేతిలో ఓటమి చవిచూశారు. ఈసారి బీఆర్‌ఎస్ టికెట్ కేటాయించకపోవడంతో కాంగ్రెస్‌లో చేరి ఖమ్మం నుంచి పోటీ చేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్‌పై ఘన విజయం సాధించారు. దీంతో ఆయనకు మంత్రి పదవి దక్కింది.

పొట్టకొట్టిన వాన



ఈదురుగాలులతో కూసుమంచిలో నేలవాలిన వరిపైరు

- అన్నదాతను నిండా ముంచిన తుపాను
- నేలకొరిగి దెబ్బతిన్న వరి, మిర్చి పంటలు
- తీతదశలో చేతికందకుండాపోయిన పత్తి పంట
- పెట్టుబడులు కూడా దక్కవని రైతుల ఆవేదన

ఖమ్మంవ్యవసాయం: 'మిచాంగ్' తుపాను అన్నదాతలను కోలుకోలేని దెబ్బతీసింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట రెండు రోజుల వానతో నేలమట్టమైంది. ఇంకొద్ది రోజుల్లో చేతికి పంట ఫలాలు అందుతాయనే గంపెడాశతో ఉన్న రైతును తుపాను కంటతడి పెట్టించింది. ఈ ఏడాది మొదట్లో సరైన వర్షాలు లేక పంటల సాగు ఆలస్యం కాగా, అరకొరగా కురిసిన వర్షాలు, జలాశయాల్లో ఉన్న నీటితో సాగు చేసిన పంటలు ప్రస్తుతం కోత, తీత దశకు చేరుకున్నాయి. ఇంతలోనే తుపాను కారణంగా కురిసిన వర్షంతో చేతికందే పంటలకు నష్టం వాటిల్లింది. జిల్లాలో 53,903 మంది రైతులకు చెందిన 82,191 ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. ఇందులో 39,276 మంది రైతులకు చెందిన 59,307 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు.

వరి ఎకరాకు రూ.25 వేల మేర నష్టం

తుపాను కారణంగా వరి సాగు చేసిన రైతులు ఎకరాకు రూ.25 వేల మేర నష్టపోయారు. వరి సాగుకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి అవుతుండగా, అన్నీ అనుకూలిస్తే ఎకరాకు 24 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ప్రస్తుత ధరతో చూస్తే సుమారు రూ.48వేల నుంచి రూ.50 వేల ఆదాయం వస్తుంది. అయితే తుపాను కారణంగా వరి నేలవాలడం, గింజ నేలరాలిపోవటం, కొంత మొలకొచ్చి దెబ్బతినటంతో ఎకరాకు ఎనిమిది క్వింటాళ్ల మేర పంట సైతం వచ్చే పరిస్థితి కానరావడం లేదు. దీంతో రూ.16వేల నుంచి రూ.17వేల వరకు నష్టపోవడమే కాక పైరు నేల వాలిన కారణంగా కోతకు అదనంగా రూ.10 వేల వరకు వెచ్చించాలి. తద్వారా ఎకరాకు రూ.25వేల నుంచి రూ.27 వేల వరకు నష్టం తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క కౌలు రైతులు ఎకరాకు రూ.40 వేల మేర నష్టపోయే పరిస్థితి నెలకొంది.

పత్తి వదిలేయాల్సిందే..

అసలే అరకొర పంట, ఆపై పంట చేతికందే సమయాన వానలు రావడంతో పత్తిని చేనులోనే వదిలేయాల్సి వస్తోంది. వర్షాలు అనుకూలించక ఈ ఏడాది 1.85 లక్షల ఎకరాల్లో మాత్రమే పత్తి సాగు చేశారు. ఎకరాకు ఐదు క్వింటాళ్ల మేర దిగుబడి వస్తుందని ఆశిస్తే తాజా వర్షాలతో సగం పంటకు నష్టం వాటిల్లింది. ప్రస్తుతం పత్తి రెండు, మూడో తీత కొనసాగుతుండగా నీరు చేరి నాణ్యత కోల్పోతోంది. పత్తి సాగుకు ఎకరాకు రూ.20 వేల మేర పెట్టుబడి అవుతుండగా, ఐదు క్వింటాళ్ల దిగుబడికి బదులు వానతో 3నుంచి 4 క్వింటాళ్లు మించే పరిస్థితి లేదు. ఎకరాకు రూ.6వేల దర అనుకున్నా రూ.40 నుంచి రూ.50 వేలు రావాల్సిన ఆదాయంలో రూ.20వేల నుంచి రూ.30వేల వరకు నష్టపోయే పరిస్థితి కనిపిస్తోంది.

ఆరెకరాల్లో వరి, ఎకరంలో మిర్చి నేలపాలు



తల్లాడ మండలం అన్నారుగూడెంకు చెందిన ఈ రైతు పేరు ఆవతి రామారావు. ఆరు ఎకరాల్లో సాంబమసూరి వరి సాగుచేసిన ఈయన ఒకటి, రెండు రోజుల్లో కోయించేందుకు యంత్రాన్ని మాట్లాడుకున్నాడు. ఇంతలోనే తుపాన్‌తో కురిసిన వర్షం కారణంగా పంట మొత్తం నేల వాలింది. ఎకరాకు రూ.50 వేల వరకు ఆదాయం వస్తుందని గంపెడాశతో ఉండగా, ఇప్పుడు పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేక ఆందోళన చెందుతున్నాడు. అలాగే, ఎకరంలో సాగు చేసిన మిర్చి కూడా నేలవాలడంతో మొత్తంగా రూ.2లక్షల నుంచి రూ. 3 లక్షల వరకు నష్టం వాటిల్లిందని చెబుతున్నాడు.


మిర్చిదీ అదే బాట...

జిల్లాలో సుమారు 80 వేల ఎకరాల్లో సాగు చేసిన మిర్చి పంటను సైతం తుపాను దెబ్బతీసింది. పచ్చికాయ దశలో ఉన్న సమయాన కురిసిన వర్షంతో పైర్లు నేలకొరిగాయి. ఆ మొక్కలు తిరిగి నిలబడేది కష్టమని, వేరు తెగి ఎండిపోతాయని రైతులు చెబుతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. ఆ పెట్టుబడి రావడం కష్టమేననే ఆందోళన వ్యక్తమవుతోంది. ఇవేకాక జిల్లాలో అక్కడక్కడా సాగు చేసిన మొక్కజొన్న, మినుము వంటి పైర్లను కూడా తుపాను దెబ్బతీసింది.



నేలవాలిన మిర్చి పైరు


పత్తి, మిర్చి పంటలకు నష్టం



నాలుగెకరాల్లో పత్తి, ఎకరన్నరలో మిర్చి సాగు చేశా. పత్తి ఎకరాకు రెండున్నర క్వింటాళ్ల దిగుబడి వచ్చేలా ఉండగా తుపాను దెబ్బతీసింది. పత్తి నాణ్యత కోల్పోగా గింజలు మొలకొస్తున్నాయి. ఇక మిర్చి మొక్కలు సైతం నేలవాలింది. పెట్టుబడి రూ.లక్ష కూడా వచ్చే పరిస్థితి లేదు.

– కందుల వెంకన్న, రైతు, కూసుమంచి

పంట, కౌలు నష్టపోయినట్లే..



నాలుగెకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశా. మొదట ఎకరాకు క్వింటన్నర మేరకు దిగుబడి వచ్చింది. రెండో తీతపై ఆశలు పెట్టుకోగా తుపాను నష్టం చేసింది. వానలతో కొంత రాలిపోగా, మరికొంత నల్ల బడుతోంది. దీంతో పంటలకు పెట్టుబడి, కౌలు చెల్లించిన నగదు నష్టపోయినట్లే.

– బానోత్ రామా, తిరుమలాయపాలెం మండలం

ఘనంగా సాయుధ దళాల పతాక దినోత్సవం

ఖమ్మంమయూరిసెంటర్: సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ఖమ్మంలోని ప్రాంతీయ సైనిక సంక్షేమ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్‌సీసీ కేడెట్లు, మాజీ సైనికుల సమక్షాన గ్యాలంటరీ అవార్డు గ్రహీత ఎన్.రోశయ్య త్రివిధ దళాల పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం దేశ రక్షణలో అసువులు బాసిన యోధులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి కొండపల్లి శ్రీరామ్ మాట్లాడుతూ పతాక దినోత్సవ నిధికి విరాళాలు సేకరిస్తున్నామని, ఇందుకు పన్ను మినహాయింపు ఉంటుందని తెలిపారు. ఆతర్వాతకలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్‌ను కలిసి స్టిక్కర్లు, టోపీలు అందజేశారు. కార్యాలయ ఉద్యోగులు కె.శ్రీనివాసరావు, షేక్ హైమత్, సైనిక సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు సుభానీతో పాటు గోపాలరావు, అంబటి సురేష్, రజాక్ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌కు స్టిక్కర్ పెడుతున్న మాజీ సైనికులు

గడువు ముగిసినా ఫీజు కట్టలేదు..

- ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు జరిమానాతో అవకాశం
- ఇప్పటికైనా మేల్కొవాలంటున్న విద్యాశాఖ

ఖమ్మంసహకారనగర్: ఈ ఏడాది పదో తరగతి, ఇంటర్‌మీడియట్ చదువుతున్న విద్యార్థులు పరీక్ష ఫీజును సకాలంలో చెల్లించలేదు. ఇప్పటికే ఫీజు చెల్లించే గడువు ముగియగా, అపరాధ రుసుంతో చెల్లించేందుకు గడువు ఉంది. కానీ ఫైన్ లేకుండా ఫీజు చెల్లించడంలో విద్యార్థులు అలసత్వం వహించడం గమనార్హం.

ఇంటర్‌లో 34,977మందే..

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు 125 ఉండగా.. ఇందులో ప్రథమ 19,311, ద్వితీయ సంవత్సరం 17,631 మంది చదువుతున్నారు. వీరిలో ప్రథమ సంవత్సరం నుంచి 18,413 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 16,564మందే పరీక్ష ఫీజు చెల్లించారు. అంటే 36,942మందికి గాను 34,977 మంది చెల్లించారని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులు రూ.510, ద్వితీయ సంవత్సరం ఆర్ట్స్ విద్యార్థులు రూ.510, సైన్స్ విద్యార్థులకు రూ.730 ఫీజు చెల్లించాల్సి ఉంది. గడువు ముగిసినందున మిగిలిన వారు అపరాధ రుసుం కూడా చెల్లించాలి. ఈనెల 13వ తేదీ వరకు రూ.వెయ్యి, 20వ తేదీ వరకు రూ.2వేల ఫైన్‌తో ఫీజు కట్టొచ్చు.

ఎస్సెస్సీలో ఇలా...

ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ, ప్రైవేట్ పాఠశాలలు 433 ఉండగా 17,368మంది ఎస్సెస్సీ విద్యనభ్యసిస్తున్నారు. పరీక్ష ఫీజు రూ.125కు గాను ఇప్పటివరకు 15,133మంది చెల్లించారు. అయితే, రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 11వరకు, రూ.500అపరాధ రుసుంతో ఈనెల 20వతేదీ వరకు చెల్లించే అవకాశం ఉంది. కాగా, విద్యార్థులందరూ త్వరగా పరీక్ష ఫీజు చెల్లించేలా చూడాలని హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లకు సూచించినట్లు డీఈఓ సోమశేఖరశర్మ, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు.

భక్తులకు ఇబ్బంది రానీయొద్దు

అధికారులకు ఆర్డీఓ ఆదేశం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో ఈనెల 13 నుంచి జనవరి 2 వరకు నిర్వహించే వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని భద్రాచలం ఆర్డీఓ మంగీలాల్ అధికారులను ఆదేశించారు. ఆలయ ఈఓ రమాదేవితో కలిసి తన కార్యాలయంలో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 22న తెప్పోత్సవం, 23న ఉత్తర ద్వార దర్శనం వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉందని, అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలన్నారు. గతంలో బాణసంచా కాల్చే సమయంలో తలెత్తిన ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలని అగ్నిమాపక సిబ్బందిని ఆదేశించారు. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, రోడ్ల మరమ్మతు పనులను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. పలుచోట్ల వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ప్రతీ ఒక్కరు సమన్వయంతో పని చేసి వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీఐ నాగరాజురెడ్డి, ఎస్‌ఐ పీవీ.రావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, అల్లం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు గోదావరికి మహా హారతి

కార్తీక మాసం సందర్భంగా ఈనెల 9న 'గోదావరి నదీ హారతి' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు. పవిత్ర గోదావరి నదీ తీరంలో సాయంత్రం 5 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆమె కోరారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు ఎంపిక


జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సత్తుపల్లిటౌన్: నల్లగొండలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు కరాటే అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వి.పిచ్చయ్య వెల్లడించారు. వివిధ విభాగాల్లో ఎం.డీ.అబ్దుర్ రిహాబ్, జి.ఉదయ్‌కిరణ్, కె.నిఖిత, సయ్యద్ ఆదిల్‌పాషా, డి.సాయివరుణ్ ఎంపికయ్యారని తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి న్యూఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. పోటీల టీమ్ మేనేజర్లుగా పిచ్చయ్య, ఇ.శ్రీధర్, ఖాసీం, కోచ్‌లుగా మహబూబ్, నరేష్, శ్రీకాంత్, మురుగన్ వ్యవహరించారు.

శ్రీకోటమైసమ్మ తల్లికి కంఠహారం


హారం అందజేస్తున్న భారతి తండ్రి

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లిలో కొలువైన శ్రీకోటమైసమ్మతల్లికి ఓ భక్తురాలు రూ.1.25లక్షల విలువైన కంఠహారాన్ని సమర్పించారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన కడియాల భారతికి అమెరికాలో ఉద్యోగం రాగా, ఆమె తండ్రి కోటేశ్వరరావు కంఠహారాన్ని గురువారం ఈఓ కె.వేణుగోపాలాచార్యులు, ధర్మకర్త పర్సా పట్టాభిరామారావుకు అందజేశారు. అర్చకులు కొత్తలంక కైలాషశర్మ, సిబ్బంది మూడ్ మోహన్, లలిత్‌సాయి పాల్గొన్నారు.

కాలినడకన వెళ్లి కురవి వీరన్న దర్శనం


కాలినడకన కురవి వెళ్తున్న గిరిజనులు

తిరుమలాయపాలెం: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రేవంత్‌రెడ్డి సీఎం కావాలని, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మంత్రి పదవి రావాలని మొక్కిన గిరిజనులు గురువారం మొక్కు చెల్లించుకున్నారు. మండలంలోని బాలాజీనగర్‌తండా, రమణాతండాకు చెందిన గుగులోతు వీరన్న, రమావత్ కైక, రమావత్ రమణనాయక్ తదితరులు 40 కి.మీ. మేర కాలినడకన మహబూబాబాద్ జిల్లా కురవి వెళ్లి అక్కడ తలనీలాలు సమర్పించి వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బద్రు, నగేష్ ధరావత్ నరేష్, నాన్యా, శ్రీకాంత్, సురేష్, సుధాకర్, వెంకన్న, భూక్యా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్త ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం

నేడు టీఎన్జీవోస్ ఆధ్వర్యాన సంబురాలు

ఖమ్మంసహకారనగర్: నూతనంగా ఏర్పాటైన రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం(టీఎన్జీఓ) జిల్లాశాఖ బాధ్యులు ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి రావడంపై జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అఫ్జల్ హసన్, ఆర్.వీ.ఎస్. సాగర్ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల కుటుంబాల ఆకాంక్షల మేరకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని వెల్లడించారు. అలాగే, సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్‌రెడ్డి.. జిల్లాకు ఉప ముఖ్యమంత్రి, రెండు మంత్రి పదవులు కేటాయించడంపై ధన్యవాదాలు తెలిపారు. కాగా, కొత్త ప్రభుత్వం ఏర్పాటైన నేపథ్యాన శుక్రవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సంబురాలు జరపనుండగా, కలెక్టరేట్‌లో ఉదయం 11–30 గంటలకు జరిగే సంబురాలకు ఉద్యోగులు హాజరుకావాలని వారు కోరారు.

ప్రజల ఆకాంక్షలను కొత్త ప్రభుత్వం నెరవేర్చాలి

ఖమ్మంమయూరిసెంటర్: తెలంగాణలో రేవంత్‌రెడ్డి నేతృత్వాన కొలువుదీరిన కొత్త ప్రభుత్వం ప్రజలు, ప్రజాస్వామిక వాదుల ఆకాంక్షలను నెరవేర్చేలా పనిచేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు కోరారు. తెలంగాణ ఉద్యమం నుంచి ఎదిగి వచ్చిన కేసీఆర్ అప్రజాస్వామికంగా వ్యవహరించడంతోనే ప్రజల చేతిలో ఓటమి ఎదురైందని చెప్పారు. ఇదే సమయాన మతోన్మాద ఫాసిస్టు బీజేపీ కొన్ని సీట్లు పెంచుకోవడం, ఓట్ల శాతం కూడా పెరగడంపై రంగారావు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఫల్యాలే బీజేపీ మతోన్మాద రాజకీయాలకు ఉపయోగపడుతున్నాయని అభిప్రాయపడ్డారు. ఎంఐఎం మతోన్మాద రాజకీయ పునాదిపై కూడా ఆందోళన వ్యక్తం చేసిన రంగారావు... రానున్న కాలంలో మతోన్మాద ఫాసిస్టు నిరంకుశ శక్తులకు వ్యతిరేకంగా బలమైన, చైతన్యవంతమైన ఉద్యమం నిర్మించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాగా, మిచాంగ్ తుపానుతో జరిగిన పంట నష్టంపై శాస్త్రీయంగా అంచనా వేసి రైతులకు పరిహారం ప్రకటించాలని ఆయన కోరారు.

స్వగ్రామాల్లో సంబురం!

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎంగా మల్లు భట్టి విక్రమార్కతోపాటు పలువురు మంత్రులు గురువారం హైదరాబాద్‌లో ప్రమాణస్వీకారం చేశారు. అయితే, ఏ జిల్లాకు దక్కని విధంగా ఖమ్మం జిల్లాకు మంత్రివర్గంలో అత్యధిక ప్రాధాన్యత లభించింది. మధిర నుంచి గెలిచిన మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగా, పాలేరు, ఖమ్మం నుంచి గెలిచిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా భట్టి, పొంగులేటి, తుమ్మల స్వగ్రామాల్లో సంబురాలు అంబరాన్నంటాయి. మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవం సందర్భంగా పలువురిని పలకరించగా.. తమ గ్రామం నుంచి మంత్రులుగా ఎదగడం ఆనందంగా ఉందని చెప్పడంతో పాటు తద్వారా గ్రామాల అభివృద్ధి వేగంగా జరుగుతుందనే భావన వ్యక్తం చేశారు.

- మంత్రివర్గంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు
- భట్టి, పొంగులేటి, తుమ్మల స్వగ్రామాల్లో హర్షాతిరేకాలు
- గ్రామస్తులు అత్యున్నత స్థాయికి చేరడంతో అభినందనలు
- అభివృద్ధి విషయంలో మరింత దూసుకెళ్తాయని భావన


కొర్లగూడెంలో పొంగులేటి చదువుకున్న హైస్కూల్


నారాయణపురంలోని పొంగులేటి ఇల్లు

నారాయణపురంలో ఆనందోత్సవాలు


మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కల్లూరురూరల్: కాంగ్రెస్ ప్రచార కమిటీ కోకన్వీనర్, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో ఆయన స్వగ్రామమైన కల్లూరు మండలం నారాయణపురంలో ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. తమ గ్రామస్తుడు రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంపై గ్రామస్తులు, ఆయన స్నేహితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కల్లూరు మండలం నుండి తొలిసారిగా శ్రీనివాసరెడ్డి మంత్రి పదవి దక్కింది. దీంతో నారాయణపురం గ్రామస్తులే కాక కల్లూరు మండల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పాలేరు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయిన శ్రీనివాసరెడ్డి ఎదిగిన తీరుతో తాము గర్వపడుతున్నామని పలువురు చెప్పారు.


స్నానాల లక్ష్మీపురంలోని భట్టి విక్రమార్క ఇల్లు

అంచెలంచెలుగా ఎదిగిన భట్టి


మంత్రి భట్టి విక్రమార్క

వైరా: వైరా మండలంలోని మారుమూల గ్రామమైన స్నానాల లక్ష్మీపురంలో జన్మించిన మల్లు భట్టి విక్రమార్క అంచెలంచెలుగా ఎదిగి ప్రభుత్వంలో కీలక నేతగా ఎదిగారు. రాష్ట్రంలో ఆ కుటుంబానికి మంచి పేరు ఉండగా.. ఇప్పుడు భట్టికి డిప్యూటీ సీఎం దక్కడంతో గ్రామం రాష్ట్ర స్థాయిలోనే గుర్తింపు సాధించినట్లయింది. ఇప్పటికే రాష్ట్రస్థాయి నేతగా ఎదిగిన ఆయన ఎమ్మెల్సీగా, మధిర నుండి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. వై.ఎస్ హయాంలో డిప్యూటీ స్పీకర్‌గా పనిచేసి ఇప్పుడు రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఆయన స్నేహితులు, గ్రామస్తులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయంపై మక్కువ


మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


గండుగులపల్లిలో మంత్రి తుమ్మల నివాసం

దమ్మపేట: దమ్మపేట మండలం గండుగులపల్లికి చెందిన ఖమ్మం ఎమ్మెల్యే తుమ్మల నాగేశ్వరరావును మంత్రి పదవి వరించింది. గండుగులపల్లిలో పుట్టి పెరిగిన తుమ్మల రాజకీయాల్లోకి వెళ్లకముందు కుటుంబ వారసత్వంగా వచ్చిన వ్యవసాయం చేసేవారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖమ్మం నుంచి గెలిచిన ఆయనకు రేవంత్‌రెడ్డి కేబినెట్‌లో మంత్రి పదవి దక్కడంపై మండల వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కాగా, తుమ్మల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఇది ఐదోసారి కావడం విశేషం. రాజకీయంగా మంత్రి పదవులను అధిరోహించినా వారసత్వంగా వచ్చిన వ్యవసాయాన్ని మాత్రం తుమ్మల ఏనాడూ వీడలేదు. పని ఒత్తిడిలో ఉన్నప్పటికీ వ్యవసాయం ఎలా జరుగుతుందో ఎప్పటికప్పుడు ఆరా తీసేవారు. వారానికి ఒక్కసారైనా గండుగులపల్లి వచ్చి వ్యవసాయ క్షేత్రాలను స్వయంగా పరిశీలించేవారు. తుమ్మల వ్యవసాయ క్షేత్రంలో వరి, మొక్కజొన్న, పుచ్చ, ఆయిల్‌పామ్ తదితర పంటలు సాగు చేస్తుండగానే... అన్ని దశల్లోనూ పరిశీలించడం అలవాటుగా మార్చుకున్నారు. ఇక పంటమార్పిడి దిశగా ఆలోచన చేసిన తుమ్మల.. తన వరి పొలంలో ఆయిల్‌పామ్ సాగు చేసి మిగతా రైతులకు ఆదర్శంగా నిలిచారు.


పామాయిల్ క్షేత్రంలో తుమ్మల (ఫైల్)

ఎంతో ఆనందంగా ఉంది.



మా గ్రామానికి చెందిన మల్లు కుటుంబం నుండి భట్టి విక్రమార్కకు డిప్యూటీ సీఎం పదవి రావడం సంతోషంగా ఉంది. మా గ్రామానికి రాష్ట్ర గుర్తింపు వస్తున్నందున ఆనందంగా ఉంది. గ్రామంలో ఆ కుటుంబం గురించే చర్చించుకుంటున్నారు. గ్రామాభివృద్ధి వేగంగా జరుగుతుందని ఆశిస్తున్నాం. – షేక్ అల్లాబాషు, స్నానాల లక్ష్మీపురం

ఆ కుటుంబం ఊరికి వన్నె తెచ్చింది..



మల్లు కుటుంబానికి రాష్ట్ర స్థాయి గుర్తింపు ఉంది. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా కాంగ్రెస్‌ను వీడకుండా కొనసాగడంతో ఇప్పుడు న్యాయం జరిగింది. ఏదిఏమైనా మా కుటుంబ సభ్యుడు డిప్యూటీ సీఎం పదవి అలంకరించడం ఆనందంగా ఉంది. ఆయన రాక కోసం మేము ఎదురుచూస్తున్నాం.

– మల్లు శాంతమ్మ, స్నానాల లక్ష్మీపురం

పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడతాడు..



నా కుమారుడు మంత్రి అయ్యాడని తెలిసి సంతోషించాను. ఎప్పుడు ప్రజల్లో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటున్నాడు. పేదల అభ్యున్నతి కోసం పాటుపడతాడు. జిల్లాతో పాటు మా గ్రామం మరింత అభివృద్ధి చెందుతుంది. మా అబ్బాయి మంత్రి అవుతాడని నేను ఎప్పుడో అనుకున్నా.

– స్వరాజ్యమ్మ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తల్లి

విద్యార్థి దశ నుంచే రాణించాడు..



నేను, శ్రీనివాసరెడ్డి ఒకటి తరగతి నుంచి నారాయణపురం, అన్నపురెడ్డిపల్లి, పేరువంచ, కల్లూరుఖమ్మంలో కలిసే చదువుకున్నాం. విద్యార్థి దశ నుంచే శ్రీనివాసరెడ్డిలో నాయకత్వ లక్షణాలు ఉండేవి. అన్నిరంగాల్లో రాణించేవారు. గతంలో ఎంపీగా గెలిచి, ఇప్పుడు మంత్రి కావడం ఆనందంగా ఉంది.

– కీసర శ్రీనివాసరెడ్డి, నారాయణపురం

ఈ ప్రాంతానికి గర్వకారణం



పొంగులేటి శ్రీనివాసరెడ్డి రాష్ట్ర మంత్రి అయ్యాడని తెలిసి సంతోషపడ్డాం. ఈ ప్రాంత వ్యక్తి గొప్ప స్థాయికి ఎదగడం మా అందరికీ గర్వకారణం. ఆయనకు మా గ్రామం, మండలంలోని సమస్యలు, ప్రజలు ఇబ్బందులు తెలుసు. ఈ ప్రాంతాన్ని శ్రీనివాసరెడ్డి అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తాడనే నమ్మకం ఉంది.

– పొంగులేటి శ్యాంసుందర్‌రెడ్డి, నారాయణపురం

జిల్లాకు శుభ పరిణామం



గండుగులపల్లికి చెందిన తుమ్మలకు మంత్రి పదవి దక్కడం జిల్లాకు శుభపరిణామం. స్వయంగా రైతు అయిన ఆయన ఆయిల్‌పామ్ సాగు పెరిగేలా తోడ్పాటునిచ్చి, అప్పారావుపేటలో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేశారు. ఏజెన్సీ గ్రామాల అభ్యున్నతికి మరింత కృషి చేస్తారనే నమ్మకముంది.

– వట్టి వెంకట్రావు, గండుగులపల్లి

మరింత అభివృద్ధి జరుగుతుంది...



మా గ్రామానికి చెందిన తుమ్మల నాగేశ్వరరావుకు మరోసారి మంత్రి పదవి దక్కడం ఆనందంగా ఉందని అన్నారు. గతంలో మంత్రిగా పనిచేసినప్పుడు మండలంలోని ప్రతీ గ్రామానికి తాగునీరు, రోడ్డు సౌకర్యం కల్పించారు. ఈసారి మళ్లీ పదవి దక్కడంతో మరింత అభివృద్ధి చేసే అవకాశం ఉంది.

– ఎర్రా వసంతరావు, గండుగులపల్లి

పరస్పరం అభినందనలు



హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎంగా జిల్లాకు చెందిన మల్లు భట్టి విక్రమార్క, మంత్రులుగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డికి భట్టి, పొంగులేటి, తుమ్మల శుభాకాంక్షలు తెలపగా ఆయన కూడా వారిని అభినందించారు.

కేసీఆర్‌ను కలిసిన పువ్వాడ



మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

– ఖమ్మం మయూరిసెంటర్

సమగ్ర చట్టం కోసం పోరాడుతా..

ఎంపీ నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: వ్యవసాయ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం సమగ్ర చట్టాన్ని తీసుకువచ్చేలా పోరాడుతానని బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు నామ నాగేశ్వరరావు తెలిపారు. న్యూఢిల్లీలో గురువారం ఆయనను ఖమ్మం నుంచి వెళ్లిన వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధి బృందం కలిసింది. ఈ సందర్భంగా రైతులు, రైతు కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలు, ఉపాధి హామీ పథకంలో ఎదురవుతున్న సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం నామ మాట్లాడుతూ తాను రైతు బిడ్డనని, వ్యవసాయం కోసం రైతు, కూలీలు ఎంత కష్టపడతారో తెలుసునని చెప్పారు. ఇప్పటికే పార్లమెంట్‌లో పలుమార్లు రైతు వ్యతిరేక చట్టాలపై మాట్లాడానని తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో సంఘ నాయకులు మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు, నందిపాటి మనోహర్, సాగర్, కే.వీ.రెడ్డి, రాధాకృష్ణ, లక్ష్మణరావు, వేణు, బంధం శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.


ఎంపీ నామను కలిసి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

బీఆర్ఎస్ ఓటమితో ఆత్మహత్యాయత్నం

చికిత్స పొందుతున్న పార్టీ నాయకుడు మృతి

రఘునాథపాలెం: రాష్ట్రంలో బీఆర్ఎస్ ఓటమి, కేసీఆర్ సీఎం కాలేదనే మనోవేదనతో పురుగుల మందు తాగిన బీఆర్ఎస్ నాయకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. రఘునాథపాలెం మండలం హరియా తండాకు చెందిన నాయకుడు మాలోత్ బద్యానాయక్ బీఆర్ఎస్ ఓటమితో మనస్తాపానికి గురై బుధవారం ఉదయం పురుగుల మందు తాగగా, ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స అందిస్తుండగానే పరిస్థితి విషమించగా ఆయన గురువారం సాయంత్రం మృతి చెందాడు. కాగా, ఆస్పత్రిలో చికిత్స చేస్తున్న సమయాన బద్యానాయక్ బీఆర్ఎస్ ఓటమిని తట్టుకోలేక ఆత్మహత్యకు యత్నించినట్లు వాంగ్మూలం ఇచ్చాడని పోలీసులు తెలిపారు. కాగా, బద్యానాయక్ మృతదేహం వద్ద బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు, నాయకులు వీరూనాయక్, పగడాల నాగరాజు, అఫ్జల్ తదితరులు నివాళులర్పించారు.

అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు


రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

తల్లాడ: మండలంలోని మంగాపురం క్రాస్ వద్ద గురువారం తెల్లవారుజామున ట్రావెల్ బస్సు అదుపు తప్పి పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. రాజమండ్రి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ట్రావెల్ బస్సు అతివేగం కారణంగా అదుపు తప్పింది. దీంతో రోడ్డుపక్కన గుంతలోకి దూసుకెళ్లి ఓ పక్కకు ఒరిగి ఆగిపోయింది. ఆ సమయాన బస్సులో 40 మంది ప్రయాణికులు ఉండగా కొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అయితే, పెను ప్రమాదం తప్పడం అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈమేరకు ప్రయాణికులను మరో బస్సులో హైదరాబాద్ పంపించారు.

పక్కింట్లో రూ.24 వేలు కొట్టేసిన విద్యార్థి

చెట్టుపై దాయడంతో వర్షానికి తడిసిన నోట్లు

నేలకొండపల్లి: ఫోన్ కొనాలనే భావనతో పక్కింట్లో నగదు చోరీ చేసిన ఏడో తరగతి విద్యార్థి ఆ డబ్బును చెట్టుపై దాయగా, తాజా వర్షానికి నోట్లు తడిసి ముద్దయ్యాయి. ఈ విషయం తెలియంతో ఉపాధ్యాయులు ఆయనకు కౌన్సెలింగ్ ఇచ్చి నగదు రికవరీ చేశారు. నేలకొండపల్లి మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థి నాలుగు రోజుల క్రితం పక్కింట్లో రూ.24 వేల నగదు చోరీ చేశాడు. అయితే, డబ్బు ఖర్చు పెట్టేందుకు భయపడిన ఆయన కొద్ది రోజుల తర్వాత ఫోన్ కొనాలనే భావనతో డబ్బును ఇంట్లోని ఓ చెట్టుపై దాచాడు. కాగా, సదరు విద్యార్థిపై అనుమానం రావడంతో గురువారం బాధితులు ఉపాధ్యాయులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు చాకచక్యంగా కౌన్సెలింగ్ చేయగా చోరీ విషయం బయటపడింది. అనంతరం చెట్టుపై పరిశీలించగా ఎడతెరిపి లేని వర్షంలో నోట్లు తడిసి రూ.2 వేల మేర పనికి రాకుండా పోయాయి. మిగిలిన రూ.22 వేల నగదును బాధితులకు అందజేశారు.

ఉదయం విధుల్లో.. సాయంత్రం విగతజీవిగా..

రోడ్డుప్రమాదంలో మృతి చెందిన ఉద్యోగి


సీపీ వారియర్‌కు సాయుధ దళాల టోపీ అందజేస్తున్న శ్రీనివాసరావు

ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం రూరల్: ఉదయం ఉత్సాహంగా విధుల్లో పాల్గొన్న ఆ ఉద్యోగి.. సాయంత్రానికి విగతజీవిగా మారడంతో కుటుంబంతో పాటు సహోద్యోగుల్లో విషాదాన్ని నింపింది. ఖమ్మంలోని రీజనల్ సైనిక్ వెల్ఫేర్ ఆఫీస్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కల్లూరి శ్రీనివాసరావు గురువారం ఉదయం కార్యాలయంలో జరిగిన సాయుధ దళాల పతాక దినోత్సవంలో మాజీ సైనిక అధికారులు, మాజీ సైనికులు, ఎన్‌సీసీ కేడెట్లతో కలిసి పాల్గొన్నారు. పతాకావిష్కరణ అనంతరం కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్‌ను కలిసి సాయుధ దళాలకు సంబంధించిన టోపీ ధరింపచేశారు. సాయంత్రం విధులు ముగిశాక కరుణగిరిలోని టీఎస్‌జీఓస్ కాలనీలో ఇంటికి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. కాసేపట్లో ఇంటికి చేరుకుంటాడనగా కరుణగిరి సమీపాన మున్నేరు బ్రిడ్జి వద్ద ఆయన వాహనాన్ని జేసీబీ తగలడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా, శ్రీనివాసరావు మృతిపై జిల్లా సైనిక సంక్షేమాధికారి కొండపల్లి శ్రీరామ్, ఉద్యోగులు, మాజీ సైనికులు సంతాపం ప్రకటించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఖమ్మం రూరల్ ఎస్సై వెంకటకృష్ణ తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

కామేపల్లి: పురుగుల మందు తాగిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. మండలంలోని బర్లగూడెంకు చెందిన ధరావత్ వాలీ(48) కొద్ది రోజులుగా మద్యానికి బానిసై బుధవారం పురుగుల మందు తాగింది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా గురువారం పరిస్థితి విషమించి మృతి చెందింది. వాలీ కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.